# అండర్ 17 సంగారెడ్డి జిల్లా క్రికెట్ జట్టుకు పటాన్‌చెరు విద్యార్థులు ఎంపిక

**పటాన్ చెరు, అక్టోబరు 9, ప్రభాతవార్త :**
సంగారెడ్డి జిల్లా అండర్ 17 క్రికెట్ జట్టుకు పటాన్చెరు పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 69వ క్రీడలలో భాగంగా అండర్ 17 సంగారెడ్డి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు గురువారం పటాన్ చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో నిర్వహించారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ఏపీఆర్ కాలనీకి చెందిన ప్రభాకర్ రెడ్డి కుమారుడు శ్రీజన్ రెడ్డి, ఏపీఆర్ గ్రాండియో కాలనీకి చెందిన సీతారామరాజు కుమారుడు గౌతమ్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. జిల్లా స్థాయి క్రికెట్ జట్టుకు ఎంపికోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలన్న లక్ష్యంతో వారికి శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. సాహిల్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ అందిస్తున్నామని వారు తెలిపారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



# స్థానిక సంస్థల ఎన్నికలలో ఏఐఎంఐఎం పోటీ

## పార్టీ సదాశివపేట మండల అధ్యక్షుడు గౌస్‌పాష

**సంగారెడ్డి, అక్టోబరు 9 (ప్రభాతవార్త):**
సదాశివపేట మండలంలో జరగనున్న జెడ్పిటిసి. ఎంపీటీసీ. గ్రామ సర్పంచ్ పంచాయతీ ఎన్నికలలో ఏఐఎంఐఎం పార్టీ పోటీ చేస్తుందని సదాశివపేట ఏఐఎంఐఎం పార్టీ అధ్యక్షులు గౌస్ పాష, జనరల్ సెక్రెటరీ హర్షత్, సెక్రటరీ లు మోహిజులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో జరగనున్న జడ్పిటిసి, ఎంపిటిసి, గ్రామ సర్పంచ్ పంచాయతీ ఎన్నికల్లో పోటీచేయాలని ఏఐఎంఐఎం జాతీయ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓ వై సి, కార్వాన్ ఎమ్మెల్యే ఎండి కౌసర్ మొయినుద్దీన్ ఆదేశాల మేరకు ఎన్నికలలో అన్ని స్థానాలకు ఏఐఎంఐ పార్టీ పోటీ చేస్తుందన్నారు. కులమతాలకతీతంగా ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థులు పట్టణ పార్టీ కార్యాలయంలో సంప్రదించి వివరాలు తెలపాలన్నారు. పార్టీ తరపున అభ్యర్థులకు పూర్తి మద్దతు ఉండి అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు.



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

### ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలకు

# నామినేషన్ ప్రక్రియ షురూ....

**ఏర్పాట్లు పరిశీలించిన ఐఎఎస్ అధికారి వాసం వెంకటేశ్వర్‌రెడ్డి**

**నామినేషన్ కేంద్రాల్లో సౌకర్యాల పరిశీలన.. అధికారులకు సూచనలు**

రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబరు 9, ప్రభాతవార్త: ఎంపీటీసీ, జెడ్పీటీసీ సాధారణ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ మొదలయింది. రామాయంపేట మండల వ్యాప్తంగా 7 ఎంపిటిసి స్థానాలు, ఒక జడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించేందుకు మెదక్ జిల్లాకు వచ్చిన సాధారణ పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి వాసం వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం రామాయంపేట మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాల్లో జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఆయన సమీక్షి ంచారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు సాఫీగా సాగేం దుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హెల్ప్ డెస్కులు, రిటర్నింగ్ అధికారి చాంబర్, నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన టేబుళ్లు, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి ఏర్పాట్లను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సమర్థవంతంగా సాగాలని పరిశీలకుడు వాసం వెంకటేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎం.నగేష్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కంగ్టిలో రెండు నామినేషన్లు దాఖలు



నామినేషన్ వేస్తున్న దృశ్యం

**కంగ్టి, అక్టోబరు 9, ప్రభాతవార్త :**
మండల కేంద్రంలో గురువారం స్థానిక జడ్పీటీసీకు అంబటి శ్రీకాంత్‌రెడ్డి, అలాగే బోర్గి ఎంపీటీసీ స్థానా నికి చంద్రవ్వ మహిళా కోట కింద నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి నూతన్‌కుమార్ ఏడీఏ గారికి అందచేశారు. వీరికి లింగన్న, సంజీవ్‌లు బలపరిచారని తెలిపారు.

## టేక్మాల్‌లో బిఆర్‌ఎస్ నిరసన



టేక్మాల్‌లో నిరసన తెలియజేస్తున్న బిఆర్‌ఎస్ నాయకులు

**టేక్మాల్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** టేక్మాల్‌లో బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడాన్ని నిరసించారు. ఈ సందర్భంగా టేక్మల్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు భక్తుల వీరప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అన్యాయం చేస్తుందని దుయ్యబట్టారు. అనాలోచిత కార్యక్రమాలతో ప్రభుత్వం ప్రజలను తప్పుదారి పట్టిస్తుందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం బీసీ ప్రజలను మోసం చేసే విధానాన్ని మానుకోవాలని మండిపడ్డారు. ఈ నిరసన కార్యక్రమంలో టేక్మాల్ సొసైటీ చైర్మన్ యశ్వంత్ రెడ్డి, యువ నాయకులు భాస్కర్, మాజీ ఎంపీటీసీ సిద్దయ్య, మాజీ కోఆప్షన్ సలీం, నాయకులు రమేష్‌నాయక్, కిషన్, గోవింధచారి, నాగరాజ్, మల్లేశం, సిరాజోద్దిన్, మతిన్, సత్తి, పౌలు, మహేంధర్‌లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

### అసుపత్రిలో వైద్యులు, సిబ్బంది

# విధులు సక్రమంగా నిర్వహించాలి

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి**

**కొమురవెల్లి, అక్టోబరు 9, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్ చెక్ చేసి ఓపి కౌంట్, ఫార్మా కౌంట్ మ్యాచ్ కావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. హాజరుపట్టికను పరిశీలించి అనుమతి లేనిదే ల్యాబ్ టెక్నిషియన్ ప్రకాష్ గైర్హాజరు కావడంతో ఆమె అగ్రహం వ్యక్తం చేస్తూ చర్యలు తీసుకోవాలని డిఎం అండ్ హెచ్‌ఓను ఫోన్ ద్వారా ఆదేశించారు. అసుపత్రిలో ల్యాబ్ గది అపరిశుభ్రంగా ఉండడంతో అటెండర్‌పై అసహనం వ్యక్తం చేశారు. అసుపత్రిలో వైద్యునితోపాటు సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని, లేనట్లయితే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఆసుపత్రికి వచ్చే పేదరోగులకు ఓపికతో మెరుగైన వైద్యంఅందించాలని సూచించారు.



ఆసుపత్రి తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

# స్థానిక ఎన్నికలపై హైకోర్టు స్టే.. నిరాశలో ఆశావహులు

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 9, ప్రభాతవార్త :**
రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు తాత్కాలికంగా స్టే విధించడంతో ఎన్నికల్లో పోటీచేయాలని ఆశపడిన నాయకులు, అభ్యర్థులలో తీవ్ర నిరాశ నెలకొంది. షెడ్యూల్ ప్రకటించి, నామినేషన్ల స్వీకరణ మొదలైన వెంటనే ఈ అనూహ్య పరిణామం చోటుచేసుకోవడం రాజకీయ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. స్టేకు కారణం ఏమిటి? తెలంగాణ ప్రభుత్వం ఇటీవల జారీచేసిన జీవో ఎంఎస్ నెం. 9 ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలలో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్‌ను 25 శాతం నుండి 42 శాతానికి పెంచింది.దీనిని సవాలు చేస్తూ హైకోర్టులో పలు పిటీషన్లు దాఖలయ్యాయి.



**పిటిషనర్ల ప్రధాన అభ్యంతరాలు:** 50 శాతం రిజర్వేషన్ పరిమితి ఉల్లంఘన: ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి మొత్తం రిజర్వేషన్ 50 శాతానికి మించ కూడదనే సుప్రీంకోర్టు తీర్పును ఈ జీవో ఉల్లంఘిస్తోందని పిటిషనర్లు వాదించారు.

**చట్టబద్ధత ప్రశ్న:** రిజర్వేషన్ల పెంపునకు సంబంధించిన బిల్లును శాసనసభలో ఆమోదించినప్పటికీ, అది ఇంకా గవర్నర్ ఆమోదం పొందకపోవడం, గెజిట్‌లో నోటిపై కాకపోవడం వంటి అంశాలను పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్లపై సుదీర్ఘంగా విచారణ జరిపిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్, జీవో నెం. 9 అమలుపై, తదనంతరం రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌పై ఆరు వారాలపాటు తాత్కాలిక స్టే విధిస్తూ గురువారం ఆదేశాలు జారీ చేసింది. కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

**ఆశావహుల్లో నిరాశ :** ఎన్నికల స్టే కారణంగా గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులకు పోటీ చేయాలనుకున్న అభ్యర్థులలో తీవ్ర గందరగోళం, నిరాశ నెలకొంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాల పరిధిలోని కొన్ని మండలాలలో గురువారం ఎంపీటీసీల, జెడ్పిటిసిలకు నామినేషన్లకు ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ కూడా జారీ చేసింది.

**సన్నాహకాలకు బ్రేక్:** ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో పలువురు ఆశావహులు ఇప్పటికే ప్రచారం, సమావేశాలు, ఇతర సన్నాహకాలకు భారీగా ఖర్చు చేశారు. స్టేకారణంగా వారి ప్రయత్నాలన్నీ ఆగిపోయాయి.

**ప్రభుత్వానికి ఎదురుదెబ్బ:** వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా సామాజిక న్యాయం అందిస్తున్నామని చెప్పిన ప్రభుత్వానికి ఈ స్టే ఒక తాత్కాలిక ఎదురుదెబ్బగా పరిగణించవచ్చు. బీసీ సంఘాలు కూడా హైకోర్టు నిర్ణయంపై నిరసన వ్యక్తం చేశాయి. అధికారుల పాలన పొడిగింపు: ఎన్నికలు వాయిదా పడటంతో స్థానిక సంస్థల బాధ్యతలు మరికొంత కాలం ప్రత్యేక అధికారుల చేతుల్లోనే ఉండనున్నాయి. ఇది పరిపాలనాపరమైన ఇబ్బందులకు దారితీయవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**రాజకీయ ఉత్కంఠ:** ఆరు వారాల తర్వాత కోర్టు విచారణ ఏ తీర్పు ఇస్తుందనే దానిపై రాజకీయ ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళుతుందా, లేదా కౌంటర్ అఫిడవిట్‌లో సరైన ఆధారాలు సమర్పించగలుగుతుందా అనే విషయాలపై అందరి దృష్టి ఉంది.తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి న్యాయపరమైన అంశాలు, రిజర్వేషన్ల చిక్కుముడి కారణంగా ఏర్పడిన ఈ తాత్కాలిక ప్రతిష్టంభన త్వరగా తొలగి, ప్రజాస్వామ్య ప్రక్రియ ముందుకు సాగాలని ఆశావహులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు.

# పారిశ్రామికవాడకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించండి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు, అక్టోబరు 9, ప్రభాతవార్త**
పటాన్‌చెరు డివిజన్ ఐలా పరిధిలోగల పరిశ్రమలకు మంచినీటి కనెక్షన్లు లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ప్రథమ ప్రాధాన్యతగా గుర్తించి ప్రతి పరిశ్రమకు మంచినీటి కనెక్షన్లు అందించేలా చర్యలు తీసుకోవాలనికోరుతూ జలమండలి ఎండి అశోక్‌రెడ్డిని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లోగల బిహెచ్‌ఇఎల్ బీఈమ్యాక్ సొసైటీ కాలనీవాసులకు మంచినీటి కనెక్షన్ల కోసం వసూలు చేస్తున్న ఇంప్రూవ్మెంట్‌చార్జీలను తగ్గించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో ఎండి అశోక్‌రెడ్డితో ఎమ్మెల్యే జీఎంఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో జలమండలి ద్వారా చేపడుతున్న మంచినీటి సరఫరా, రిజర్వాయర్లు, నూతన కనెక్షన్లపై చర్చించారు. ప్రధానంగా పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఐలా పారిశ్రామిక వాడలో గల వందలాది పరిశ్రమలలో నిత్యం వేలాదిమంది కార్మికులు పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారని తెలిపారు. పరిశ్రమలకు మంచినీటి కనెక్షన్లు లేకపోవడం మూలంగా తాగునీటి కోసం ప్రతిరోజు కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇటీవల పరిశ్రమల యాజమాన్యాల ప్రతినిధులు తన దృష్టికి తీసుకొని వచ్చారని పేర్కొన్నారు. జలమండలి ఆధ్వర్యంలో ప్రతి పరిశ్రమకు మంచినీటి కనెక్షన్లు అందించేలా వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ఉస్మాన్ నగర్‌లో బిహెచ్‌ఈఎల్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు బిఈమెక్ సొసైటీ పేరుతో గృహాలను నిర్మించుకొని జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. ఇటీవల మంచినీటి కనెక్షన్ల కోసం జలమండలికి దరఖాస్తు చేసుకోగా, మూడు కోట్ల రూపాయలు చెల్లించాలని ఇందులో 86 లక్షల రూపాయలు ఇంప్రూవ్‌మెంట్ చార్జీలు కట్టాలని నోటీసులు అందజేశారని తెలిపారు. ప్రస్తుతం కాలనీలో అత్యధిక శాతం ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు నివసిస్తున్నారని, మూడుకోట్ల రూపాయలు చెల్లించే ఆర్థిక పరిస్థితులు వారికి లేవని ఆయన తెలిపారు. 86 లక్షల రూపాయల ఇంప్రూవ్‌మెంట్ చార్జీలను రద్దు చేస్తే మిగతా డబ్బులు కట్టేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్‌రెడ్డి త్వరలో వీటికి సంబంధించి ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు.

సమావేశంలో రామచంద్రాపురం మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, ఐలా ప్రతినిధులు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, మాజీ ప్రజా ప్రతినిధులు నరసింహ, ఉమేష్, మధు, బీఈ మ్యాక్ అధ్యక్షులు శివ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



జలమండలి ఎండి అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

# బిసిలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న కాంగ్రెస్, బిజెపిలు

**గజ్వేల్ టౌన్, అక్టోబరు 9 (ప్రభాతవార్త):**
కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు బిసిలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని, బిసిలకు మొదటి నుంచి అన్యాయం జరుగుతుందని బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కళ్యాణ్‌కార్ నర్సింగరావు అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగంలోని సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా ఏర్పాటుచేసిన రిజర్వేషన్ల ఫలాలు కానీ బిసి సమాజానికి వచ్చే సరికి అదేదో గొంతెమ్మ కోరికలు లెక్క ప్రభుత్వాలు చూస్తున్నాయని, కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బిసి ఓట్లను దండుకొని ఏర్పాటుచేసిన ప్రభుత్వం నిబద్ధతతో రిజర్వేషన్ ప్రక్రియను చేయలేదని స్పష్టంగా తెలుస్తుందన్నారు. ఆనాటి నుండి కాకా కాలేల్కర్ కమిషన్ మరియు మండల కమిషన్ ఏర్పాటుచేసిన న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. విపి సింగ్ మండల్ కమిషన్ ఆధారంగా బిసిలకు న్యాయం చేయాలని చూస్తే అప్పుడున్న జాతీయ పార్టీ కనుసన్నల్లో మెలిగే యువమోర్చా ద్వారా యూనివర్సిటీలలో అల్లర్లు సృష్టించి ప్రభుత్వాన్ని కూల్చింది ఎవరో సమాజం మరిచిపోలేదన్నారు. 50 శాతం సీలింగ్ అని ముందుకు తీసుకొచ్చిన పెద్దలకు ఈ డబ్ల్యూఎస్ రిజర్వేషన్ 10 శాతం ఇచ్చినప్పుడు 50 శాతం సీలింగ్ మించుతుందని వారికి తెలియదా అన్నారు. ఈ దేశంలో ఉన్నత వర్గాలకు ఒక న్యాయం, బడుగు బలహీన వర్గాలకు ఒక న్యాయం జరుగుతుందన్నారు. మీ దగ్గర చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రపతి దగ్గర బిల్ పెండింగ్‌లో ఉన్నది కాబట్టి అఖిలపక్షాన్ని తీసుకుపోయి కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలన్నారు.

# సాంకేతిక శిక్షణతో ఉపాధి అవకాశాలు మెరుగు

**సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**

**హత్నూర అక్టోబరు 9 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ఐటిఐ కళాశాలలో ఏర్పాటుచేసిన అడ్వాన్స్‌డు టెక్నాలజీ సెంటర్‌ను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఏటిసి సెంటర్‌లో ఎంత మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు అన్న వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక శిక్షణా కార్యక్రమాలు, సౌకర్యాలు, సెంటర్‌లోఉన్న అవసరాలపై కలెక్టర్ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఏ ఏ కోర్సులలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు ? వారికి అందుతున్న అధునాతన శిక్షణపై కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏటీసీలో అందిస్తున్న అధునాతన శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని దానిలో మంచి నైపుణ్యం సాధించి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ఏటీసీ సెంటర్ లో ఉన్న మౌలిక సదుపాయాలు అవసరాలపై సమగ్రంగా సమీక్షి ంచారు. రానున్న రోజుల్లో అడ్వాన్స్డ్ టెక్నాలజీ రంగంలోనే ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఏటీసీలో శిక్షణ పొందిన వారికి భవి ష్యత్తులో మంచి ఫలితాలు వస్తాయని కలెక్టర్ తెలి పారు. ఈ సందర్శనలో ఏటీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



హత్నూరలోని ఏటీసీ సెంటర్‌ను సందర్శించిన సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

**రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి**

**హత్నూర, అక్టోబరు 9 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం హత్నూర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వార్డులను, మెడికల్ స్టోర్ రూమ్‌లో మందులనిల్వలను కలెక్టర్ పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద రోగులకు మెరగైన వైద్య సౌకర్యాలు కల్పించడం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అనేక రకాల సౌకర్యాలను ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. వాటిని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వ్యాధుల వ్యాప్తిని నియంత్రించడానికి క్షేత్రస్థాయి సిబ్బంది అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యవసరంగా అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన సేవలందించాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుల వివరాలు తెలుపుతున్న ఏసిపి నరసింహులు

# మహిళ హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

**జగదేవ్‌పూర్, అక్టోబరు 9 (ప్రభాతవార్త):** ఒక మహిళ హత్య కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు గజ్వేల్ ఏసిపి నరసింహులు తెలిపారు. జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన హత్య కేసు వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామానికి చెందిన ఆలేటి యాదవరెడ్డికి ఇద్దరు కుమార్తెలు కాగా చిన్న కూతురు అపర్ణ అబ్బాస్ అనే యువకుడిని ప్రేమించింది. వీరి పెళ్లికి అపర్ణ తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో ఈ సంవత్సరం జనవరి నెలలో ప్రేమ వివాహం చేసుకొని కొంతకాలం జనగాంలో నివాసం ఉండగా తర్వాత కుకునూర్‌పల్లికి వచ్చారు. మూడు నెలల క్రితం అపర్ణ, అబ్బాస్‌ల మధ్య గొడవలు రావడంతో అపర్ణ తన తండ్రి యాదవరెడ్డి వద్దకు వచ్చింది. తిరిగి అబ్బాస్ దగ్గరికి వెళ్లామనే ఆలోచనతో తనను తీసుకెళ్లమని అబ్బాస్‌ను కోరగా ఈనెల 7వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు అబ్బాస్ కారు తీసుకొని అపర్ణ ఇంటికి వచ్చి తీసుకెళ్లాడు. దీంతో ఆగ్రహానికి గురైన అపర్ణ తండ్రి యాదవరెడ్డి, తల్లి నిర్మల, చిన్నాన్న రామ్‌రెడ్డిలు అబ్బాస్ కుటుంబంపై దాడి చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలో అబ్బాస్ తల్లి సైనాబేగం అడ్డురావడంతో వారితో తెచ్చుకున్న ఇనుపరాడ్‌తో కొట్టడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సైనాబేగంను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. అబ్బాస్ ఫిర్యాదు మేరకు జగదేవ్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు వారు ఉపయోగించిన ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురు నిందితులను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం గజ్వేల్ కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఏసిపి నరసింహులు తెలిపారు. ఈ సమావేశంలో గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి, జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణారెడ్డి, పోలీసులు సిబ్బంది సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## బస్సు, లారీ ఢీకొని 13 మందికి గాయలు

**కొండపాక, అక్టోబరు 9, ప్రభాతవార్త :** బస్సు, లారీ ఢీకొని 13 మందికి గాయలైన సంఘన గురువారం రాజీవ్ రహదారిపై కుకునూర్‌పల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కోరుట్ల నుంచి హైదారాబాద్ వెళ్తున్న బస్సు కుకునూర్‌పల్లి రైల్వే బ్రిడ్జిపైన ఉన్న లారీని బస్సు ఢీ కొట్టడంతో బస్సులో ఉన్న 13 మంది ప్రయాణీకులకు గాయలైనాయి. 108 సిబ్బంది గాయలకు గురైన వారిని చికిత్సనిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ అసుపత్రికి తరలించారు.

## ఇస్నాపూర్‌లో ఎండు గంజాయి దహనం



దాహనం చేసిన ఎండు గంజాయి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, అక్టోబరు 9, ప్రభాతవార్త:**
సంగారెడ్డి జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ(డిడిసి) ఆదేశాల మేరకు, సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ అధికారి పర్యవేక్షణలో, సంగారెడ్డి జిల్లాలోని వివిధ ఎక్సైజ్ స్టేషన్లలో నమోదు చేసిన 26 కేసులలో సీజ్ చేయబడిన 143.9 కిలోల ఎండు గంజాయి, 623 గంజాయి మొక్కలను గురువారం ఇస్నాపూర్ వద్ద ఇన్సినరేషన్ పద్ధతిలో దహనం చేయడం జరిగిందని సంగారెడ్డి ఎక్సైజ్ సీఐ ఎండి నజీర్‌పాషా తెలిపారు. దహనం చేయబడిన గంజాయి విలువ రూ. 1 కోటీ 34 లక్షల వరకు ఉంటుందని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (సీఐ) ఎండి నజీర్ పాషా తెలిపారు.

# బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

**తాడ్మనూరులో కిడ్నాప్ అయిన బాలుడిని పట్టుకున్న పోలీసులు**

**గుల్బర్గాలో కిడ్నాప్ చేసిన వ్యక్తులు అరెస్ట్**

**జోగిపేట, అక్టోబరు 9,ప్రభాతవార్త:**
మండల పరిధిలోని తాడ్మనూరులో జరిగిన ఆరేళ్ల బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం అయిింది. ఒకేరోజు లో పోలీసులు దీనిని చేధించారు. తాడ్మన్నూరు గ్రామంలో బంధువుల వద్ద ఉంటున్న పవన్‌చి(6)ను బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని రాత్రి జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు జోగిపేట ఎస్‌ఐ పాండు గ్రామానికి వెళ్లి బాబు ఉంటున్న బంధువులను అన్ని విషయాలు విచారించిన అనంతరం సిసి కెమెరాల ఆధారంగా బాలుడిని ఎక్కడకి తీసుకెళ్లారనేది పరిశీలించారు. బంధువులనుంచి సేకరించిన సమాచారంమేరకు, సిసి కెమెరా ఫుటేజీల ఆధారంగా బుధవవారం రాత్రి అనుమానం మేరకు కర్ణాటకలోని గుల్బర్గాకు జోగిపేట ఎస్‌ఐ పాండు వెళ్లి కిడ్నాప్ అయిన బాలుడు పవన్‌ను గుర్తించటంతోపాటు, కిడ్నాప్‌కు పాల్పడిన సునీల్, రవిలను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఈ కిడ్నాప్‌కు పాల్పడిన వ్యక్తులు బాలుడికి బంధువులే అన్నట్లు సమాచారం.



కిడ్నాప్ అయిన బాలుడితో పోలీసులు



వెంకట్రాంరెడ్డిని సన్మానిస్తున్న పిఆర్‌టియు నాయకులు

## ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం

**జగదేవ్‌పూర్, అక్టోబరు 9 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న చిలుకూరి వెంకట్రాంరెడ్డికి ఇటీవల జిల్లా ఉపాధ్యాయ అవార్డు రావడంతో పిఆర్‌టియుటిఎస్ జగదేవ్‌పూర్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి బొద్దు నాయక్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ గురువారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తున్న వెంకట్రాంరెడ్డిని ప్రభుత్వం గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందించడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో పిఆర్‌టియు నాయకులు రామకృష్ణారెడ్డి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు నరేందర్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, రఘురాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, మహిళా ఉపాధ్యక్షులు సంధ్యాకుమారి, ప్రధానోపాధ్యాయులు జ్యోతి, పిఆర్‌టియు బృందం శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, నర్సింలు, శ్రీనివాస్, వాణి, మేనక, విజయలక్ష్మి, శ్రీనివాస్, విమల, రజిత, నవీన్ పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి బాలల కథల పోటీకి శ్రీహర్షిత ఎంపిక

**కోహెడ, అక్టోబరు 9, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన బాలల కథల పోటీలలో మండల పరిధిలోని శనిగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నేరెళ్ల శ్రీహర్షిత రాసిన స్నేహమే బహుమతి అనే కథకు జిల్లాస్థాయిలో తృతీయ బహుమతి లభించింది. హర్షితకు శిక్షణ ఇచ్చిన తెలుగు భాష ఉపాధ్యాయులు రచ్చ జగదీశ్వర్‌ను తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య ప్రెస్‌క్లబ్‌లో శాలువాతో ఘనంగా సత్కరించి మెమొంటోను అందించారు. విద్యార్థితో పాటు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయున్ని హెచ్‌ఎం,ఉపాధ్యాయుల బృందం అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ మట్ట సంపత్‌కుమార్‌రెడ్డి, మండల విద్యాధికారులు యాదవరెడ్డి, ఆర్.పద్మయ్య, కన్వీనర్ దుర్గయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా నిర్మల


అవార్డు అందుకుంటున్న అంగన్‌వాడీ టీచర్ నిర్మల

**నారాయణఖేడ్, అక్టోబరు 9 ప్రభాతవార్త :** నారాయణఖేడ్ ప్రాజెక్టు పరిధిలో నాగలిగిద్ద మండలం సేరి దామరగిద్ద గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ నిర్మలను ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా ప్రశంసా పత్రాన్ని ఐసిడిఎస్ పిడి లలిత కుమారి అందజేసి అవార్డు ఇవ్వడం జరిగింది. ఈ అవార్డు రావడంతో నిర్మల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సుజాత, ఏ సిడిపిఓ సూపర్వైజర్లు అంగన్‌వాడీ టీచర్ పాల్గొన్నారు

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి : మైనంపల్లి హనుమంతరావు


కండువా కప్పి పార్టీలో ఆహ్వానిస్తున్న మైనంపల్లి హనుమంతరావు

**చిన్నశంకరంపేట, అక్టోబరు 9,ప్రభాతవార్త:** కాంగ్రెస్‌పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. గురువారం భాగ్యనగరంలోని తన నివాసంలో మండల పరిధి ధర్పల్లి గ్రామానికి చెందిన పలువురు బిఆర్‌ఎస్ నాయకులు మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషిచేయాలని కోరారు. ఈ క్యాక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, కుమ్మరి ప్రవీణ్, సిద్దిరాంరెడ్డి, అంజాగౌడ్, పెంటారెడ్డి, బాలేష, వెంకట్, బిక్షపతి, రామయ్య, కొమురయ్య, లక్ష్మణ్, నేష్, రాజు రాములు తదితరులు పాల్గొన్నారు.

## వంతెనకు మరమ్మతులు

**చిన్నశంకరంపేట, అక్టోబరు 9,ప్రభాతవార్త:** ఇటీవల కురిసిన వర్షాలకు సూరారం గ్రామంలోని అనంత పద్మనాభస్వామి ఆలయంవద్దగల వంతెన కొట్టుకుపోవడంతో రైతులు, తండా వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు గుత్తే దారుతో మాట్లాడి వంతెన నిర్మాణాన్ని తాత్కాలికంగా మర్మత్తులు చేయించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల యూత్ నాయకులు రాజ్‌కుమార్ గౌడ్, తదితరులు ఉన్నారు.

## పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే ప్రభాకర్ కృషి

### బిఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మల్లన్న

**సంగారెడ్డి, అక్టోబరు 9 (ప్రభాతవార్త):** సదాశివ పేట పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కృషి చేస్తున్నారని బిఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ శివరాజ్‌పాటిల్, మాజీ వైస్ చైర్మన్ చింతా గోపాల్ అన్నారు. గురువారం సదాశివపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణాభివృద్ధికి టియుఎఫ్ఐడిసి నిధులతో రూ. పది కోట్లు పనులకు ఈనెల 7న టెండర్లు పిలవబడింద న్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో ముఖ్యమంత్రి నిధుల ద్వారా మాజీ మంత్రి హరీష్‌రావు సహకారంతో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ రూ.25 కోట్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. అందులో మొత్తం 324 పనులకు గాను 208 పనులకు మాత్రమే ప్రభుత్వం రూ. 13 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. టియుఎఫ్ఐడిసి నిధులను 18 కోట్ల 50 లక్షల రూపాయలను గత ప్రభుత్వం మంజూరు చేయగా ఎనిమిది నుండి పది కోట్ల వరకు అభివృద్ధి పనులకుగాను టెండర్లు పిలవడం జరిగింది. పాత మార్కండేయ స్కూల్ దగ్గర మల్టీ పర్పస్ భవన నిర్మాణానికిగాను ఒక కోటి రూపా యలను పాత మున్సిపల్‌కార్యాలయాన్ని కాంప్లెక్స్ నిర్మాణం కోసం ఒక కోటి రూపాయలను మురికి కాలువల నిర్మాణం కోసం ఒక కోటి నలభై లక్షల రూపాయలను సిద్దాపూర్ గౌని నుండి ఆత్మకూరు బేసి వరకు సిసిరోడ్డు నిర్మాణం ఒక కోటి రూపాయ లను మంజూరు చేయడం జరిగిందని అలాగే యువకులు ఒక కోటి 50 లక్షల రూపాయల టెం డర్లు పిలవడం జరిగిందని యువకుల కోసం స్విమ్మింగ్ పూల్ నిర్మాణం కూడా చేపట్టడం జరుగు తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంబించి సదాశిపేట పట్టణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని బిఆర్‌ఎస్ నాయకులు మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు కోదూర్ అంజయ్య, అక్బర్‌హుస్సేన్, ఇంద్ర మోహన్ గౌడ్, నాగుల విజయ్ కుమార్, నాగనాథ్, బరాడి శివ, నాసీర్, వాదోని రాజు, జబ్బర్,దిడిగే నాగేష్, ఫణి, కామేల్, ఆయుబ్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

### స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి బిక్షపతి


మాట్లాడుతున్న బిక్షపతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** పెన్షనర్లను వేధిస్తున్న ప్రధాన సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్(ఎస్‌జిపిఎటి) రాష్ట్ర కార్యదర్శి జోగు బిక్షపతి డిమాండ్ చేశారు. స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్(ఎస్‌జిపిఎటి) జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు చిల్ల నరసింహులు అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడారు. 2024 మార్చి తర్వాత పదవీ విరమణ పొందిన వారికి పెన్షన్ బెనిఫిట్లు ఇప్పటివరకు రాలేదన్నారు. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు కాకపోవడం, హెల్త్‌కార్డులు పనిచేయకపోవడంతో వైద్య సేవలకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 5 విడతల డిఏ డిఆర్‌లు ఆర్‌పిఎస్ 2023 అమలులో జాప్యంవంటి సమస్యలపై సంఘం ఆందోళన వ్యక్తం చేస్తుందన్నారు. పెన్షనర్ల సమస్యలను ప్రత్యేకంగా పరిష్కరించేందుకు డైరెక్టర్‌ను నియమించాలని 20 ఏళ్లు సేవ చేసిన అనంతరం పదవీ విరమణ చేసిన ఉద్యోగులందరికీ పూర్తి పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై న్యాయవాది రాకేష్ చేసిన దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.రాకేష్‌ను వెంటనే న్యాయ మండలినుంచి తొలగించాలంటూ డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు మధు సూదన్‌రెడ్డి,అన్నమరెడ్డి, నారాయణరెడ్డి, సత్తయ్య, బన్సీ లాల్, ఇంద్రసేనారెడ్డి, నాగేందర్, శ్రీనివాస్, నర్సయ్య, పర్శరాములు, బాలనర్సయ్య, భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణం చేస్తున్న గీతం అధ్యాపకులు, విద్యార్థులు

## పర్యావరణ పరిరక్షణలో మేము సైతం

### మొక్కలు నాటిన గీతం అధ్యాపకులు, విద్యార్థులు

**పటాన్‌చెరు, అక్టోబరు 9, ప్రభాతవార్త :** పర్యావరణ స్థిరత్వం, దానిపై అవగాహన, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందిలో సంఘటిత భావాన్ని ప్రోత్సహించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని మహిళా సాధికారత విభాగం (డబ్ల్యూఈసీ) గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించింది. పచ్చదనం, పరిశుభ్రత, మరింత స్థిరమైన ప్రాంగణ వాతావరణాన్ని పెంపొందించడంలో గీతం కుటుంబ సభ్యులంతా సమిష్టి బాధ్యత తీసుకునేలా ప్రేరేపించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. గీతం ప్రాంగణంలోని ఎంపిక చేసిన ప్రాంతాలలో మొక్కలు నాటడంలో అంతా ఉత్సాహంగా పాల్గొని, పర్యావరణ పరిరక్షణలో గీతం నిరంతర నిబద్ధతను పునరుద్ఘాటించారు. మహిళా సాధికారత విభాగం చైర్ పర్సన్ ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, పర్యావరణ స్పృహను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాలు పర్యావరణ సమతుల్యతకు దోహదపడటమే కాకుండా విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న వారందరిలో సోదర భావం, సమిష్టి కృషి, తమదనే భావనను పెంపొందిస్తాయన్నారు. రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, సీనియర్ అధ్యాపకురాలు ప్రొఫెసర్ ఎం.అక్కలక్ష్మి ్మ, క్రీడా విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నారాయణ రావు, ఎస్టేట్ అధికారి ఎం.సతీష్ తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, అందరినీ ఉత్సాహపరిచారు. మహిళా సాధికారత విభాగం సభ్యులు, పలువురు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు మొక్కలు నాటడంలో చురుకు గా పాల్గొన్నారు. వారి సమిష్టి కృషి, ఐక్యతా స్ఫూర్తి, ఉమ్మడి ఉద్దేశాన్ని ఈ కార్యక్రమం ప్రతిబింబించడమే గాక, గీతం సంస్కృతి, సామాజిక బాధ్యతలను మరోమారు వెల్లడించింది.

## స్థానిక సంస్థల ఎన్నికలకు హైకోర్టు బ్రేక్

### ఆశావాహుల్లో నిరుత్సాహం

**నర్సాపూర్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికలకు హైకోర్టు బ్రేక్ ఇవ్వడంతో నర్సాపూర్ మండల పరిధిలోని ఆశావాహుల్లో నిరుత్సాహం నెలకొంది.ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధం కాగా గురువారం బీసీల 42 శాతం రిజర్వేషన్ పెంచడంపై హైకోర్టు స్టే విధించింది అదేవిధంగా ఎన్నికలపై స్టే విధించింది. అంతేగాక ఎంపీటీసీ జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియ కూడా నిలిపివేసింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడతాయా లేక కొనసాగుతాయన్న సందేహంతో గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నిరుత్సానికి గురయ్యారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసినట్లయితే బీసీలంతా రాజకీయంగా ఎదుగుతారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రస్తుత ప్రభుత్వం పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికలు జరుపుతారా అని మరికొందరు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీలో నిలబడే అభ్యర్థులు కొంతవరకు నిరుత్సాహానికి గురవుతున్న మాట వాస్తవం. కాగా కొందరు రిజర్వేషన్లు కలిసొచ్చిన ఆశావాహులు నామినేషన్ల ప్రక్రియకు కావాల్సిన ప్రతులను తయారు చేసుకున్నారు. ఇంతలోనే హైకోర్టు ఎన్నికలపై, రిజర్వేషన్లపై స్టే విధించడంతో ఆశావాహులందరూ చల్లబడ్డారు. ఈ మేరకు స్థానిక సంస్థలు ఎన్నికలు వాయిదా పడతాయా లేక నిర్వహిస్తారా అన్న సందేహంతో ఆశావాహులు సంద్గిద్గంలో ఉన్నారు

## రహీంఉద్దీన్ భౌతిక కాయానికి ఎమ్మెల్యే నివాళి

**నర్సాపూర్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** నర్సాపూర్ పట్టణం లోని ఎన్జీఓఎస్ కాలనీకి చెందిన విశ్రాంతి ఉద్యోగులు రహీం ఉదీన్ కొద్దిరోజులుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందారు, గురువారం సాయంత్రం ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి పట్టణంలోని వారి నివాసానికి వెళ్ళి ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు , అనంతరం భౌతిక కాయానికి ఘన నివాళులు అర్పించారు, ఆమె వెంట బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, అశోక్ గౌడ్, నయీం ఉద్దీన్, సత్యం గౌడ్ షేక్ హుస్సేన్ ప్రసాద్ సూరారం నర్సింలు,పార్టీ మండల అధ్యక్షులు భోగ శేఖర్,పట్టణ అధ్యక్షులు పంబల్ల బిక్షపతి,మొహమ్మద్ , ఆనంద్ కుమార్, తదితరులు వున్నారు.


లక్ష్మీ ్మనారాయణ కుటుంబ సభ్యులకు లక్ష రూపాయిల చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, సామ్యానాయక్ తదితరులు

## పిఆర్‌టియుటిఎస్ సభ్యులను ఆదుకుంటాం

### ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

**నర్సాపూర్, అక్టోబరు 9, ప్రభాతవార్త:** పిఆర్‌టియు టిఎస్ క్రియాశీలక సభ్యత్వం తీసుకున్న సభ్యులెవరైన మృతి చెందినట్లయితే వారి కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించి ఆదుకుంటామని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలో పిఆర్‌టియు టిఎస్ క్రియాశీలక సభ్యులు పిఆర్‌టియు టిఎస్ నర్సాపూర్ మండల అధ్యక్షులు అచ్చంపేట పాఠశాల హెచ్‌ఎం, హిందీ పండితుడిగా పనిచేస్తున్న బి లక్ష్మీనారాయణ అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసింది. స్వర్గీయ లక్ష్మీనారాయణ కుటుంబాన్ని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి పరామర్శించి పి ఆర్ టి యు టి ఎస్ ప్రవేశపెట్టిన 200 సభ్యత్వం ప్రధానోపాధ్యాయులు స్వర్గీయ లక్ష్మీనారాయణ తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన కుటుంబానికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు ఒక లక్ష రూపాయల చెక్కును స్వర్గీయ లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి ఆర్ టి యు సంఘ సభ్యులకు అపన్న హస్తం అందిస్తూ ఆపదలో ఎల్లవేళలా అండ గా ఉంటామన్నారు. మరణించిన పి ఆర్ టి యు టి ఎస్ సభ్యుల కుటుంబాలకు అండగా ఉండి మనోధైర్యం కల్పించడమే ప్రధాన ఉద్దేశమని ఆయన అన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమం కోసం టి ఆర్ టి యు నిరంతరం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి పేర్కొన్నారు.ఇందులో బాగంగానే మృతి చెందిన పిఆర్‌టియు టిఎస్ మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ కుటుంభానికి లక్ష రూపాయిల చెక్కును అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టి ఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పులగం దామోదర్ రెడ్డి, సుంకరి బిక్షం గౌడ్, మెదక్ జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాళ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సామ్యా నాయక్, కేజీబీవీ రాష్ట్ర నాయకురా లు స్వరూప రాణి ,మాజీ జిల్లా అధ్యక్షులు సబ్బాని శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులు మల్లారెడ్డి గోపాల్ రెడ్డి, వీరేశం, శివంపేట అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అనిల్ రెడ్డి రాఘవేందర్,చెన్న చందర్, మనోహరాబాద్ అధ్యక్షులు నాగరాజు నర్సా గౌడ్ వెంకటేశ్వర్లు ఇంతియాజ్, నర్సాపూర్ మండల ప్రధాన కార్యదర్శి బీమ్లా నాయక్, మండల విద్యాధి కారులో తారా సింగ్ బుచ్చా నాయక్ పాల్గొన్నారు

## కాంగ్రెస్‌కు రాం రాం బిఆర్‌ఎస్‌లో చేరిక

**కొండపాక, అక్టోబరు 9, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అనంతుల నరేందర్ సతీమణి కొండపాక మాజీ ఎంపిపి అనంతుల పద్మతో పాటు రాంపల్లి మల్లేషం, కోడెల ఐలయ్యలు గురువారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సమక్షంలో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బిఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి హరీష్‌రావు పార్టీ కండువా కప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈ సందర్భంగా పద్మనరేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతులకు యూరియా కూడా సరిగా సరఫరా చేయాలేని దుర్భర పరిస్థితిలో కూరకుపోయిందన్నారు. వృద్దులకు ఎన్నికల్లో మాట ఇచ్చిన ప్రకారం పెన్షన్ రూ॥ 4 వేలు చెల్లించలేకపోవడమే కాకుండా హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చడం బాధకరమన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకొని, 6 గ్యారంటీలను అమలు చేయలేని పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉందన్నారు. కొంత మంది కాంగ్రెస్ నాయకుల తీరు నచ్చక కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్‌ఎస్ చేరుతున్నామన్నారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అనంతుల ప్రశాంత్, ర్యాగల దుర్గయ్య, నర్ర జయపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బొద్దుల తిరుపతి, రాములుగౌడ్, బానుచందర్ గౌడ్, కర్ణకర్,అంజయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న హరీష్‌రావు

# విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించాలి

### ఎమ్మెల్యే జిఎంఆర్


ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**సంగారెడ్డి, అక్టోబరు 9 ప్రభాతవార్త :** విద్యార్థి దశ నుంచి క్రీడల పట్ల ప్రోత్సాహం అందిస్తే.. అద్భుతమైన విజయాలు సాధిస్తారని.. ఇందుకు బీరంగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులే ఉదాహరణ అని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఇటీవల మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన ఉషూ (కిక్ బాక్సింగ్) రాష్ట్ర స్థాయి పోటీల్లో బీరంగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఎం.అశ్విని అండర్ 17 విభాగంలో బంగారు పతకం సాధించింది. త్వరలో కాశ్మీర్లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఇదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రుత్విక రెడ్డి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా స్థాయి షటిల్ బ్యాట్మెంటన్ పోటీల్లో బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు గురువారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. రాబోయే జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలలో మెరుగైన ప్రదర్శనతో జాతీయ స్థాయిలో పటాన్ చెరు పేరును నిలబెట్టాలని కోరారు. క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులను క్రీడలపట్ల ఆసక్తి పెంపొందించేలా సంపూర్ణ సహకారం అందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసంత, ఫిజికల్ డైరెక్టర్ అమూల్యను ఎమ్మెల్యే జిఎంఆర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ముత్తంగి మాజీ సర్పంచ్ ఉపేందర్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, చంద్రశేఖర్, మాణిక్ ప్రభు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

## ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను పరామర్శించిన హరీష్‌రావు

**సిద్దిపేట రూరల్(చిన్నకోడూరు), అక్టోబర్ 9, ప్రభాతవార్త:** చిన్నకోడూరు మండలం గంగాపూర్‌లో రాష్ట్ర మాజీ ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజ్జయ్య గురువారం మృతి చెందడంతో బాధిత కుటుంబీకులను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పరామర్శించి ఓదార్చారు. అనంతరం విజ్జయ్య మృత దేహానికి హరీష్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బిఆర్‌ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, దేవిప్రసాద్, వంటేరు ప్రతాప్‌రెడ్డి, కూర మాణిక్యరెడ్డి, రాధాకృష్ణశర్మ, పూజల చిన్న, గూడల శ్రీకాంత్‌గౌడ్, మాదాసు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## మండలంలో బిఆర్‌ఎస్ పార్టీకి షాక్

### సొంత గూటికి మాజీ జడ్పీ పోతరాజు రమణ


హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న పోతరాజు రమణ

**చిన్నశంకరంపేట, అక్టోబరు 9, ప్రభాతవార్త:** పోతరాజు రమణ అంటే కాంగ్రెస్, కాంగ్రెస్ అంటే పోతరాజు రమణ అన్నట్లు ఉండేది చిన్నశంకరంపేట మండలంలో గత శాసనసభ ఎన్నికల్లో మారిన సమీకరణాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీని వీడి బిఆర్‌ఎస్ పార్టీలో చేరిన మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పోతరాజు రమణ తిరిగి సొంత గూటికి చేరారు. గురువారం భాగ్యనగరంలోని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మెదక్,మల్కాజ్‌గిరి మాజీ శాసనసభ్యుడు మైనంపల్లి హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో రమణ చేరడంతో మండలంలో పార్టీ మరింత బలోపేతం అయిందన్నారు.

## బిసిలు ఐక్యతను చాటాల్సిన అవసరం అసన్నమైంది

### టిపిసిసి సభ్యుడు దరిపల్లి చంద్రం

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 9, ప్రభాతవార్త :** జీవో నంబరు 9న పై హైకోర్టు స్టే విధించడానికి ప్రధానకారణం బిఆర్‌ఎస్సేనని టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం మండిపడ్డారు. గురువారం ఆయన మాట్లాడుతూ బీసీల నోటి కాడి ముద్ద లాగేసిందని మండిపడ్డారు. బిజెపి,బిఆర్‌ఎస్ పార్టీలలో ఉన్న అగ్ర కులాల నాయకుల మోసాలను చూసి బీసీ ప్రజలు కళ్లు తెరిచి పెద్ద ఎత్తున్న బిసి ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీలో రెండు పార్టీలు బీసీ రిజర్వేషన్‌ను అమోదించాయని గుర్తు చేశారు. తీర రెండు పార్టీలు కుమ్మక్కై బీసీ రిజర్వేషన్లను నిలిపివేయించా యని ఆరోపించారు. బీసీల నోటి కాడి ముద్దను లాగేసిన రెండు పార్టీలపై బీసీలు ఉద్యమించాలన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యవర్గం

**సంగారెడ్డి, అక్టోబరు 9(ప్రభాతవార్త):** రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సమావేశం సదాశివపేటలో గురువారం మాజీ అధ్యక్షుడు బోడపల్లి శంకరప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ చంద్రశేఖర్, జిల్లా జనరల్ సెక్రెటరీ మురళీధర్, జిల్లా కోశాధికారి బసవేశ్వర్, సిహెచ్ రాములు హాజరై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎనుకున్నారు.అధ్యక్షునిగా నిమ్మాయిల మల్లేశం, జనరల్ సెక్రెటరీగా తుక్కుదాస్ నెల్లి, కోశధికారిగా సి విశ్వనాథం,అసోసియేట్ అధ్యక్షునిగా బుచ్చప్ప, ఉపాధ్యక్షులుగా ఎస్ సత్యనారాయణ, ఏం నిర్మల,జాయింట్ సెక్రటరీగా భీమ్రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్ మల్లేశం, ప్రచార కార్యదర్శిగా బి కాశీనాథం,జిల్లా కౌన్సిలర్‌గా పి వీరప్ప,చిక్కుర్తి అంబయ్య, అంబటి విశ్వనాథములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మల్లేశం మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అభివృద్ధికి సభ్యుల సహకారంతో ఎల్లవేళలా అండగా ఉంటన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి టీ పండరి కోశాధికారి చింత జనార్ధన్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## డబల్ బెడ్ రూమ్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి


ఆర్వోకి వినతిపత్రం అందజేసిన సిపిఎం నాయకులు

**సంగారెడ్డి, అక్టోబరు 9 ప్రభాతవార్త :** అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలోని డబల్ బెడ్‌రూమ్ కాలనీల్లో తాగునీరు,డ్రైనేజ్, రోడ్లు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాలు తక్షణం కల్పించాలని సిపిఎం నాయకులు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ ఆర్వో మనోహర్, సానిటేషన్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, ప్రజలు ఇళ్లలోకి చేరి నెలలైనా ఇప్పటికీ అవసరమైన సదుపాయాలు లభించక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తిచేశారు.

## పోగొట్టుకున్న ఫోన్‌ను బాధితునికి అందజేత

**కోహెడ, అక్టోబరు 9, ప్రభాతవార్త :** పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సిఈఐఆర్ పోర్టల్‌ద్వారా గుర్తించి ఎస్ఐ అభిలాష్ గురువారం బాధితునికి అందజేశారు. బంజరుపల్లి నుంచి హుస్నాబాద్ మీదుగా కోహెడ్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో ఫోన్ పడిపోయింది. బాధితుడు కోహెడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ ద్వారా పోయిన ఫోన్‌ను గుర్తించి ఎస్ఐ అభిలాష్ చేతుల మీదుగా అందజేశారు.

## బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**పాపన్నపేట, అక్టోబరు 9, ప్రభాతవార్త :** మండల పరిధి నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన శేరి మహబూబ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి గురువారం కుటుంబీకులను పరామర్శించారు. ఆమె వెంట పార్టీ మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి,మాజీ జిల్లా రైతు బందు కమిటీ అధ్యక్షుడు సోములు, ఏడుపాయల మాజీ చైర్మన్ బాలాగౌడ్, పాపన్న పేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ జగన్, గురుమూర్తి గౌడ్, లింగారెడ్డి, శ్రీనివాస్, శ్రీనాథ్, సంజీవరెడ్డి, సాయివర్ధన్ గౌడ్, తదితరులున్నారు.

## కాంగ్రెస్ పార్టీ విజయం కోసం ఐక్యంగా కష్టపడాలి: మంత్రి పొన్నం ప్రభాకర్

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 09, ప్రభాతవార్త :**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం, ప్రజా పాలన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెవెళ్లాలని హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నవీన్ యాదవ్‌ను ప్రకటించడంతో మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను నవీన్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అదేవిధంగా నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన బూతుస్థాయి నుంచి నాయకులు కార్యకర్తలను ఐక్యంగా కలుపుకుని పోతూ విజయం సాధించేలా కష్టపడాలని సూచించారు. అనంతరం నవీన్‌యాదవ్ మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనీలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని తాను కాంగ్రెస్ పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా గెలుపే లక్ష్యంగా అందరిని కలుపుకుని పోతూ ముందుకు వెళ్లడం జరుగుతుందని పేర్కొన్నారు.



హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్.

## బిసి రిజర్వేషన్‌లపై ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలతోనే హైకోర్ట్ స్టే విధించింది : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**పేట్ బషీరాబాద్, అక్టోబర్ 9, ప్రభాతవార్త**

కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో జీ.వో.నెం.9ను శాస్త్రీ య పద్ధతిలో కాకుండా తమకు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించడం వల్లే హైకోర్టు స్టే ఇవ్వాల్సి వచ్చిందని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ప్రభుత్వ విధానం శాస్త్రీయంగా, సరిగ్గా లేదని బిఆర్ఎస్ పార్టీ తరపున అసెంబ్లీ వేదికగా మా నాయకులు, మేము ఎన్నోసార్లు ప్రభుత్వానికి హితవు పలికామని, రేవంత్ సర్కార్ మాత్రం మా సలహాలను, సూచనలను పెడచెవిన పెట్టడం వల్లే నేడు హైకోర్టులో స్టే విధించాల్సిన పరిస్థితి ఏర్పడింద న్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుతో పాటు అనేక హామీలను కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సాక్షి గా ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు కావస్తున్న బీసీ రిజర్వేషన్ల అమలు, వారికి ఇచ్చిన హామీల అమలులో తూతూ మంత్రంగా వ్యవహరిస్తూ చేతులు దులుపుకుంటున్నారే తప్పా హామీల అమలులో ప్రభుత్వానికి ఎటువంటి చిత్తశుద్ధి కనిపించడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కామారెడ్డి వేదికగా బిసి డిక్లరేషన్ అమలు విషయంలో అఖిలపక్షం సభ్యుల సూచనలను, సలహాలను పెడచెవిన పెట్టకుండా శాస్త్రీయబద్ధంగా రూపొందించాలని, లేకపోతే వెనుకబడిన వర్గాల తరఫున పోరాడేందుకు బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు.

## ఫలక్‌నుమా కాళిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు

**హైదరాబాద్, అక్టోబరు 9 ప్రభాతవార్త:**

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అమ్మవారి దయ దీవెనలు ప్రజలంద రిపై ఉండాలని ఏఐసిసి జాతీయ కోఆర్డినేటర్ డాక్టర్ పి.వి.రవిశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం వెంగళరావునగర్‌కాలనీ నుంచి పలువురితో కలసి ఫలక్‌నామా కాళిమాత ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం పెద్దఎ త్తున అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, గురు నాథరావు, కుటుంబరావు, నాళం రాజు, భరత్‌కుమార్, మహేష్ కుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# కలిసొస్తారా.. 'చేయి'స్తారా..!

## - ఆశావాహుల తీరుపై నెలకొన్న అనుమానాలు



**జూబ్లీహిల్స్, అక్టోబరు 9, ప్రభాతవార్త:**

కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు కొత్త తలనొప్పి వచ్చి పడింది. నిన్నమొన్నటి వరకు అభ్యర్థిత్వం విషయంలో ఆశావాహుల సంఖ్య చాంతాడంత లిస్టు ఉండగా ఎట్టకేలకు అధిష్టానం నవీన్‌యాదవ్ వైపు మొగ్గు చూపి ప్రకటించింది. ఇన్నాళ్లు టిక్కెట్ రేసులో పోటిపడిన మిగిలిన ఆశావాహు లు ఇప్పుడు కలిసొస్తారా..! లేక చేయిస్తారా..! అనే మీమాంస పార్టీ అధిష్టానాన్ని, అభ్యర్థిని వేధిస్తుంది. ముందు ఇళ్లు చక్కబెట్టే పనిలో ఇప్పుడు పార్టీ అధిష్టానం దృష్టి సారించింది. మరోవైపు పార్టీలో టిక్కెట్ ఆశించి రాకపోవడంతో కొందరు నేతలు బాహా టంగానే ధిక్కార స్వరం వినిపించడంతోపాటు మరికొందరు నేతలు తమ అభ్యర్థిత్వానికి మద్దతిచ్చి ప్రయత్నించిన 'పెద్ద' నేతల వద్ద తమ అభిప్రాయాన్ని కుండబద్దలు కొట్టి చెబుతున్నారు. తాము మద్దతిచ్చి గెలిపిస్తే రానున్న రోజుల్లో తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. దీంతో ఇప్పుడుపార్టీ నాయకత్వం సైతం సొంత ఇంటిలో దిద్దుబాటు చర్యలు చేపట్టే ప్రయత్నాలను ప్రారంభిస్తుంది.

### ముందకెళా వెళ్దాం

జూబ్లీహిల్స్ నియెఓజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి టిక్కెట్ ఆశించిన వారిలో ప్రధానంగా మాజీ ఎంపీ అంజన్ కుమార్‌యాదవ్, మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి, కాంగ్రెస్ నేత గుర్రం మురళీగౌడ్, మహిళా నాయకురాలు ... జర్ల విజయలక్ష్మి తో పాటు పలువురు ఉన్నారు. వీరంతా టిక్కెట్ కోసం ఆశించడమే కాకుండా పెద్దఎత్తున ఖర్చు సైతం చేశారు. అంజన్‌కుమార్‌యాదవ్ తనకున్న స్వచ్ఛంద సంస్థ ద్వారా నియోజకవర్గంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించారు. ఇక మిగిలిన నేతలు తమకు తెలిసిన సంఘాలతో సమావేశాలు నిర్వ హించి వారిని సంతృప్తి పరిచే ప్రయత్నం చేశారు. మిగిలిన నాయ కులంతా దాదాపుగా నియోజకవర్గం మొత్తం ఫ్లెక్సీలు వేసి బరిలో మేము ఉన్నామంటూ తేల్చిచెప్పారు. అయితే టిక్కెట్ రాకపోవడంతో ఇప్పుడు వీరంతా మద్దతిస్తారా లేదా అనేది ప్రశ్నగా మారింది.

### బుజ్జగింపుల బాధ్యత మంత్రులదే..!

పార్టీ టిక్కెట్ ఆశించి భంగపడ్డ నేతలను బుజ్జగించే పనిని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యతలను పర్య వేక్షిస్తున్న మంత్రులకు అప్పగించే ఆలోచనలో ఉంది. వీరితోపాటు కాంగ్రెస్ నుంచి కీలకంగా ఉన్న కొంద రు నేతలు సైతం విముఖంగా ఉన్నారు. బయటికి అధిష్టానం నిర్ణయం అంటూ తేల్చిచెప్పినా లోలో పల తమ కార్యకర్తలు, అనుయాయులతో అవసరమై న మంత నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఆశావాహులతోపాటు పార్టీలో ఉంటూ విముఖంగా ఉన్న నేతలను కలుపుకొని వెళ్లేందుకు అధినాయకత్వం మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, తుమ్మల నాగేశ్వర్‌రావులకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ గెలుపు బాధ్యతలను అప్పగించింది. వీరంతా చాలా కాలంగా స్థానికంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, కాలనీ సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో మమేకమై ఉన్నారు. ఈ క్రమంలోనే పార్టీ టిక్కెట్ ఆశించిన నేతలను ఇప్పుడు బుజ్జగించేందుకు వారినే రంగంలోకి దింపాలని భావిస్తున్నారు. రెబల్‌గా పోటీచేసేందుకు ఎవరూ ముందుకు రాకున్నా వారందరిని ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రచారంలో నవీన్‌యాదవ్‌కు తోడుగా నిలపాలని ఆలోచిస్తున్నారు. తద్వారా కలిసికట్టుగా ముందుకు తీసుకెళ్లి జూబ్లీహిల్స్‌లో పార్టీ జెండా పాతాలని ఆలోచిస్తున్నారు.

## బస్‌ఛార్జీల పెంపుకు నిరసనగా ఆర్టీసి బస్‌లో కెటిఆర్ ప్రయాణం



మారేడ్‌పల్లిలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావ్‌లతో బేటీ అయిన కేటీఆర్ తదితరులు

**కంటోన్మెంట్, అక్టోబర్ 9 ప్రభాతవార్త:** ఆర్టీసి బస్ ఛార్జీల పెంపును నిరసిస్తూ గురువారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఛలో బస్ భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మారేడ్‌పల్లిలో నివాసం ఉంటున్న మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల కేటీఆర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యేలు సమావేశమైయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వారిని హౌజ్ అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రయత్నించారు. పెంచి బస్ ఛార్జీలపై తాము ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేయడలేదని ఆర్టీసి క్రాస్‌రోడ్డులోని బస్ భవన్‌కు రేతి బస్టాప్ నుంచి బస్‌లో వెలుతామని చెప్పడంతో పోలీసులు వెనక్కి తగ్గారు. బస్ ఛార్జీల పెంపునకు నిరసనగా బిఆర్ఎస్ చేపట్టిన ఛలో బస్ భవన్ కార్యక్రమం విజయవంతం అయింది. సికింద్రాబాద్ రేతిఫైల్ బస్టాప్ నుంచి కాచిగూడ డిపోకు చెందిన రూట్ 2 బస్‌లో మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్‌లు కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమ నేతలు గజ్జెల నాగేశ్, మన్నెక్రిషాంక్, నర్సింహ్మ ముదిరాజ్, కార్పోరేటర్లు మహేశ్వరి, హేమలత,రాసూరి సునీత, లింగాని ప్రసన్న శ్రీనివాస్‌లతో పాటు బిఆర్ఎస్ కార్యకర్తలు తరలివెళ్ళారు. దీంతో మారేడ్‌పల్లి తలసాని నివాసం వద్దరేతిఫైల్ బస్టాంట్ వద్ద కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బస్‌లో ఎక్కిన బిఆర్ఎస్ నశ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బస్ భనవ్‌కు తరలివెళ్ళారు.

### కాంగ్రెస్ రెండేళ్లుగా నిరంకుశ పాలన సాగిస్తుంది : హరీష్‌రావు

**నార్సింగి, అక్టోబర్ 9 ప్రభాతవార్త** : మణికొండ మున్సిపాలిటీ పుప్పాలగూడలోని మాజీ మంత్రి హరీష్‌రావ్‌తో కలిసి బిఆర్ఎస్ నాయకులు బస్‌భవన్‌కు తరలివెళ్లారు. మెహిదీపట్నం వద్ద బస్సులో ఎక్కి టికెట్లు తీసుకొని బస్‌భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావ్ మాట్లాడుతూ ఆచరణకు సాధ్యపడని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రెండేళ్లుగా నిరంకుశ పాలన సాగిస్తుందని ఆరోపించారు. 420.హామీలు తుంగలో తొక్కి, మహిళలకు ఉచిత బస్సు అంటూ, మగవారికి డబుల్ చార్జీలు వసూలు చేయడం దారుణమని మండిపడ్డారు. ఆర్టీసి బస్సుల చార్జీలను అడ్డగోలుగా పెంచి ప్రజలపై పెనుభారాన్ని మోపుతున్నారన్నారు. విద్యార్థుల బస్‌పాస్ ధరలు పెంచారని, రౌండ్ ఫిగర్ పేరిట పెంచారని, పండగల వేళ రెట్టింపు చేసి ప్రజల రక్తంను తాగుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య బద్దంగా, రాజ్యాంగం కల్పించిన హక్కును ఉపయోగించుకోనివ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్ నాయకులను హౌస్ అరెస్టులు చేయడం అన్యాయమన్నారు. బీఆర్ఎస్ బయటకు వచ్చి ఉద్యమిస్తే, నిజాలు ప్రజలకు తెలిసిపోతాయన్న భయం కాంగ్రెస్ ప్రభుత్వంలో కనిపిస్తుందని, అందుకే ముందస్తుగా బస్‌భవన్‌కు రాకుండా బిఆర్ఎస్ నాయకులను పోలీసులతో ఆపివేయించారన్నారు. ఈ కార్యక్రమంలో మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ, నాయకులు అండె లక్ష్మణ్‌రావ్, నరేందర్, సంగం శ్రీకాంత్, శ్రీశైలం, భానుచందర్, సుమనళిని, మహేందర్, రాజేంద్రప్రసాద్, విజయలక్ష్మి, బాబురావ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### జూబ్లీహిల్స్‌లో తనిఖీల్లో రూ. 9 లక్షలు పట్టివేత

**జూబ్లీహిల్స్, అక్టోబరు 9, ప్రభాతవార్త:**

ఎన్నికల నిబంధనల వేళ జూబ్లీహిల్స్‌లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో పోలీసులు భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్ మెట్రో స్టేషన్ సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే ఒక వ్యక్తి అనుమానస్పదంగా తారసపడటంతో అతన్ని విచారించి అతని వద్ద రూ. 9 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. డబ్బు యజమానిని గుర్తించేందుకు ప్రయ్నతిస్తున్నారు. పట్టుబడిన వ్యక్తిని విచారిస్తున్నారు.

## నగర వ్యాప్తంగా రోడ్‌సేఫ్టీ డ్రైవ్

### 13,738 గుంతలను పూడ్చిన జిహెచ్ఎంసి



రోడ్లపై గుంతలను పూడ్చివేస్తున్న జిహెచ్ఎంసి సిబ్బంది

**హైదరాబాద్, అక్టోబరు 9,ప్రభాతవార్త:**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్డు భద్రత చర్యలలో భాగంగా గుంతల పూడ్చివేత పనులు, క్యాచ్ పిట్ రిపేర్‌లు, కవర్ రీప్లేస్‌మెంట్‌లు, సెంట్రల్ మీడియన్ మరమ్మతులు నిరంతరంగా కొనసాగుతున్నాయి. అక్టోబర్ 9 గురువారం నాటికి నగరంలో మొత్తం 13,738 గుంతలకు మరమ్మతులు చేయడం జరిగింది. నిన్నటి వరకు 13, 372 గుంతలను పూడ్చివేయగా, ఇవాళ ఒక్కరోజే 366 గుంతలకు మరమ్మతులు చేశారు. మిగిలిన గుంతలను వచ్చే వారం రోజుల్లో గా పూడ్చివేసేందుకు జిహెచ్ఎంసి ఇంజనీర్ విభాగం కృషి చేస్తుంది.కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తూ త్వరగా పూర్తి చేసేలా మార్గనిర్దేశనం చేస్తున్నారు.

## బాచుపల్లిలో కొండచిలువ కలకలం

### ఆందోళనలో అపార్ట్‌మెంట్‌వాసులు



**హైదరాబాద్, అక్టోబరు 9, ప్రభాతవార్త** ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరద పోటెత్తిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో పాములు, కొండచిలువలు, మొసళ్ల జనావాసాల్లోకి ప్రవేశించి, భయాందోళనకు గురి చేస్తున్నాయి. మొన్నటి వరకు మూసీ నది పరివాహక ప్రాంత ప్రజలకు మొసళ్ళ, కొండచిలువలు కంటి మీద కునుకు లేకుండా చేశాయి. తాజాగా బాపుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డి ల్యాబ్ సమీపంలోని ఓ ఆపార్టుమెంట్‌లో కొండచిలువ కలకలం సృష్టించింది. అపార్ట్‌మెంట్ రెండో అంతస్తులో కొండచిలువ ప్రత్యక్షమైంది. అపార్ట్‌మెంట్‌వాసులు కొండచిలువను చూసి తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్థానిక పోలీసులకు, సమాచారం ఇవ్వటంతో స్నేక్ సొసైటీ సభ్యులతో అక్కడికి చేరుకొని కొండచిలువను పట్టుకున్నారు.అనంతరం అడవిలో వదిలేశారు.కొండచిలువను బంధించడంతో అపార్ట్‌మెంట్‌వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ ఏరియాలో ఉన్న అడవుల నుంచి కొండచిలువ జనవాసాల్లోకి వచ్చి ఉండొచ్చని అధికారులు పేర్కొన్నారు. ఏది ఏమైనప్పటికీ స్థానికులు అప్రమత్తంగా ఉండాలని,పిల్లలను ఒంటరిగా బయటకు పంపొద్దని హెచ్చరించారు.

## విద్యుత్ మీటర్ కమర్షియల్..ప్రాపర్టీ టాక్స్ రెసిడెన్షియల్

- -జిఐఎస్ సర్వేతో 93వేల ప్రాపర్టీలను గుర్తించిన జిహెచ్ఎంసి
- -అసెస్‌మెంట్ చేయకుండా దాదాపు 70వేల భవనాలు
- -ఈపడాది టాక్స్ వసూలు టార్గెట్ రూ.3 వేల కోట్లు
- -ఇప్పటి వరకు వసూలైంది రూ.1438 కోట్లు
- -మార్చి కల్లా పూర్తి చేసేలా ప్రణాళికలు




**హైదరాబాద్, అక్టోబరు 9,ప్రభాతవార్త:** జిహెచ్ఎంసిలో ప్రాపర్టీ టాక్స్ చెల్లిస్తున్న 19.50లక్షల ఆస్తులపై చేపట్టిన జిఐఎస్ సర్వేతోపాటు కరెంట్ మీటర్లను లింక్ చేయడం ద్వారా ఒక్కో మోసం వెలుగులోకి వస్తుంది. జిహెచ్ఎంసి పరిధితో దాదాపు 93వేల ఆస్తుల యజమానులు కరెంట్ మీటర్లను కమర్షియల్‌గా వినియోగిస్తున్నప్పటికీ జిహెచ్ఎంసికి మాత్రం రెసిడెన్షియల్ ప్రాపర్టీ టాక్స్ చెల్లిస్తున్నట్లు గుర్తించారు. ఆస్తులను త్వరలోనే మూడేళ్ల కమర్షియల్ టాక్స్‌ను విధించి నోటీసులు జారీ చేసేందుకు జిహెచ్ఎంసి రంగం సిద్ధం చేసింది. అలాగే ఈభవనాలు ఎందుకు పన్ను పరిధిలోకి రాలేదో లోతుగా పరిశీలించి,సిబ్బంది నిర్లక్ష్యం ఏమైనా ఉంటే చర్యలు తీసుకోవడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. అలాగే ఆయా భవనాల వినియోగాన్ని భట్టి వాటిని చెల్లింపు పరిధిలోకి తీసుకువచ్చి ఏకంగా మూడేళ్ల టాక్స్‌ను వడ్డించాలని జిహెచ్ఎంసి భావిస్తుంది. ఈభవనాలన్ని కమర్షియల్ టాక్స్‌పరిధిలోకి తీసుకురావడం ద్వారా అదనంగా రూ.400 నుంచి 500కోట్లు వరకు పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**ఈపడాది టార్గెట్ 3వేలకోట్లు..**

జీహెచ్ఎంసీ ప్రధాన ఆర్థిక వనరైన ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ ను వర్తమాన ఆర్థిక సంవత్సరం రికార్డు స్థాయిలో పెంచుకునేందుకు అధికారులు వ్యూహం సిద్ధం చేశారు. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో రూ. 2200 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ ను లక్ష్యంగా పెట్టుకోగా, చివరి నిమిషం వరకు రూ. 2038 కోట్లు వసూలయ్యాయి. ప్రతి ఆర్థిక సంవత్సరం వసూలైన మొత్తం ప్రాపర్టీ ట్యాక్స్ కు అదనంగా రూ. 200 కోట్ల నుంచి రూ. 300 కోట్ల వరకు టార్గెట్ పెంచుకుని ట్యాక్స్ స్టాఫ్ ట్యాక్స్ కలెక్షన్ చేస్తుండేది. కానీ ఈ వర్తమాన ఆర్థిక సంవత్సరం ఏకంగా రికార్డు స్థాయిలో రూ. 3 వేల కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ ను వసూలు చేసుకోవాలని అధికారులు ప్లాన్ చేస్తున్నారు. అంటే గత ఆర్థిక సంవత్సరం రూ. 2038 కోట్లు వసూలు కాగా, ఈ సంవత్సరం ఏకంగా రూ. 962 కోట్ల భారీ టార్గెట్ ను అధికారులు పిక్స్ చేసుకున్నారు. గత ఏప్రిల్ మాసం నుంచి ఈ నెల 8వరకు రూ. 1348 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు కాగా, గతేడాదితో పోల్చితే రూ. 103 కోట్లు అదనంగా వసూలైనట్లు అధికారులు వెల్లడించారు. లక్ష్యాన్ని చేరేందుకు మిగిలిన రూ. 1652 కోట్ల ట్యాక్స్ వచ్చే మార్చి నెలాఖరు కల్లా వసూలు చేసేలా సిటీలోని 30 సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లకు, ట్యాక్స్ ఇన్ స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లకు టార్గెట్లు ఫిక్స్ చేసినట్లు సమాచారం. ఇప్పటి వరకు ప్రతి నెల 30 సర్కిళ్ల నుంచి రూ. వంద కోట్ల వరకు ట్యాక్స్ వసూలు చేయాలన్న నిబంధన ప్రస్తుతం అమల్లో ఉండగా, దీన్ని సవరించి మొత్తం సర్కిళ్ల నుంచి ప్రతి నెల రూ. 200 కోట్ల వరకు ట్యాక్స్ వసూలు చేయాలంటూ ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిసింది. అలాగే సిటీలోని మొత్తం 30 సర్కిళ్లలో శేరిలింగంపల్లి ఇప్పటి వరకు ఈ నెల 7వ తేదీ సాయంత్రం వరకు రూ. 214 కోట్ల ట్యాక్స్ కలెక్షన్ చేసి, టాప్ వన్ స్థానంలో నిలిచింది. ఆ తర్వాత స్థానంలో జూబ్లీహిల్స్ సర్కిల్ రూ. 125 కోట్లు వసూలు చేయగా, ఖైరతాబాద్ 98 కోట్లు వసూలు చేసినట్లు, ఇక కలెక్షన్ లో చివరి స్థానంలో ఫలక్ నుమా సర్కిల్ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**మాల్స్‌పై ఫోకస్..**

సిటీలోని అన్ని సర్కిళ్లల్లో ఉన్న మాల్స్ పై ట్యాక్స్ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ సర్క్యులర్ జారీ చేసినట్లు సమాచారం. ముఖ్యంగా సర్కిళ్ల పరిధిలోని డిప్యూటీ కమిషనర్లు, ట్యాక్స్ ఇన్ స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు తమ పరిధిలోని మాల్స్‌కు నేరుగా వెళ్లి, మాల్స్ ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లిస్తున్నాయా? లేదా? అన్న విషయాన్ని నిర్ధారించుకోవాలని, ఒక వేళ ట్యాక్స్ చెల్లింపు పరిధిలో లేని పక్షంలో వెంటనే వాటిని ట్యాక్స్ చెల్లింపు పరిధిలోకి తీసుకురావాలని, ఆ మాల్స్ లోని అన్ని వ్యాపార సంస్థలను కూడా ట్రేడ్ లైసెన్స్ పరిధిలోకి తీసుకురావాలని కమిషనర్ సర్క్యులర్ లో ఆదేశించినట్లు తెలిసింది.

## నిండు ప్రాణానికి రెండు చుక్కలు

### -జిల్లాలో 12 నుండి 15 వరకు పల్స్ పోలియో కార్యక్రమం : జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి

**హైదరాబాద్, అక్టోబరు 9,ప్రభాతవార్త:** నిండు ప్రాణానికి రెండు చుక్కలు అని పోలియో రహిత సమాజమే మన ముందున్న లక్ష్యమని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. గురువారం కలెక్టరేట్ లోని తన చాంబర్ నుండి ఈ నెల 12 నుండి 15 వరకు నిర్వహించే పల్స్ పోలియో నిర్వహణ కార్యక్రమంపై జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 12న హైదరాబాద్ లోని 2843 కేంద్రాల్లో పోలియో5 పిల్లలకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని తెలిపారు. 5 సంవత్సరాల పిల్లలకు పోలియో వ్యాధి నివారణకు రెండు పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఈ కార్యక్రమంలో 5,17,238 మంది పిల్లలకు పోలియో చుక్కలు అందించనున్నామని స్పష్టం చేశారు. నగరంలో 9,36,016 ఇండ్లల్లో ఉన్న 05 సంవత్సరాల గల పిల్లలకు కవర్ చేయడం జరుగుతుందని అన్నారు. పోలియో కేంద్రాలు ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు తెరచి ఉంటాయని అలాగే తేదీ 13, 14, 15 లలో 11,200 మంది వైద్య సిబ్బంది ఇంటింటికి వచ్చి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ లో 164 హైరిస్క్ ఏరియాలను గుర్తించడం జరిగిందని తెలిపారు. అపార్ట్మెంట్లు, గృహాలలో ఉండే 05 వయస్సుగల పిల్లలున్న తల్లిదండ్రులు తమ పరిధిలో ఉన్నటువంటి పల్స్ పోలియో కేంద్రాలలో పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, వాలంటీర్స్, పారా మెడికల్, నర్సింగ్ విద్యార్థులు పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పిల్లల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటి, డి ఎం ఓ రాములు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి

### ఎంసిసి ఉల్లంఘనలపై వేగంగా స్పందించాలి : ఆర్.వి.కర్ణన్



కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న ఆర్.వి.కర్ణన్, హేమంత్‌కేశవ్ పాటిల్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 9,ప్రభాతవార్త:**

ఎన్నిక ముగిసే వరకూ అప్రమత్తంగా ఉండాలనీ కంట్రోల్ రూమ్ బాధ్యులు, సిబ్బందని జిల్లా ఎన్నికల అధికారి,జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశించారు. ఈమేరకు గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో గురువారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కంట్రోల్ రూంను జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ ఆర్ వి కర్ణన్ ప్రారంభించారు.జీహెచ్ఎంసీ ఎన్నికల అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, విజిలెన్స్ అదనపు ఎస్పీ , నోడల్ అధికారి నరసింహారెడ్డి, మీడియా నోడల్ అధికారి దశరథం, సిఐ అమృత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్వేచ్ఛాయిత ,పారదర్శక ఎన్నికల నిర్వహణలో ఎంసీసి కంట్రోల్ రూమ్ ముఖ్య భూమిక పోషించాలని జిల్లా ఎన్నికల అధికారి అన్నారు.కంట్రోల్ రూమ్ కు వచ్చేఎన్నికల ప్రవర్తన నియమవళి ఉల్లంఘన ఫిర్యాదుల పై సత్వరమే స్పందించాలన్నారు. ఎంసీసీ ఉల్లంఘనలు జరిగినట్లు సమాచారం అందినవెంటనే క్షేత్రస్థాయి ఎన్నికల బృందాలులను అప్రమత్తం చేయాలన్నారు.

## స్కూల్ బస్సులో మంటలు..తప్పిన పెను ప్రమాదం

**అడ్డగుట్ట, అక్టోబర్ 9 ప్రభాతవార్త:**



స్కూల్ బస్సులో చేలరేగిన మంటలను ఆర్పుతున్న ఆర్మీ పోలీసులు

సికింద్రాబాద్ ఏఓసి సెంటర్ నుంచి మహేంద్రహిల్స్‌లో ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు వెళ్తున్న స్కూల్ బస్‌లో హఠాత్తుగా మంటలు చెలరేగిన సంఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. గురువారం ఏఓసి సెంటర్ మార్గంలో వెళ్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ బస్ మహేంద్ర హిల్స్ వెళ్తుండగా అకస్మాత్తుగా బస్‌లో నుంచి పొగలు, మంట లు చెలరేగడంతో అప్రమత్తమైన స్కూల్ బస్ డ్రైవర్ బస్‌లో ఉన్న విద్యార్థులను కిందకు దింప డంతో నప్రాణాపాయం తప్పింది. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అం దించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది, ఆర్మీ జవాన్లు,ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొ ని మంటలను అదుపు చేశారు. విద్యార్థులను మరో బస్‌లో స్కూల్‌కు పంపించారు. ఈ కేసును తిరుమలగిరి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. షాట్ సర్క్యూట్ తో బస్ దగ్ధమైనట్లు పోలీసులు భావిస్తున్నారు.